
ప్రజాశక్తి
శనివారం 8 ఫిబ్రవరి 2025 5 విజయనగరం



నేడు మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు రాక



ప్రజాశక్తి-కొత్తవలస

భారత మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్య నాయుడు శనివారం జిల్లాకు రానున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ తెలిపారు. ఉదయం 8.20 గంటలకు విశాఖ నుంచి కొత్తవలస చేరుకుంటారని తెలిపారు. ఉదయం 10.20 గంటలకు మంగళపాలెంలోని శ్రీ గురుదేవా చారిటబుల్ ట్రస్టుకు చేరుకొని డాక్టర్ విజయశ్రీ పల్లేటివ్ కేర్ ఆసుపత్రిని ప్రారంభిస్తారు. అనంతరం గురుదేవా ట్రస్టు 26వ వార్షికోత్సవంలో పాల్గొంటారు. మధ్యాహ్నం 12 గంటలకు మంగళపాలెంలో బయలుదేరి విశాఖ చేరుకుంటారు. మాజీ ఉప రాష్ట్రపతి జిల్లా పర్యటనకు సంబంధించి ఏర్పాట్లపై సమన్వయ అధికారిగా డిఆర్‌డిఎ పిడి ఎ.కళ్యాణ చక్రవర్తిని నియమించారు.

100 రోజుల్లో ఇళ్ల స్థలాలు

- మానాపురం రైల్వే ట్రాక్ నిర్వాసితులకు తహశీల్దార్ హామీ
- ఫలించిన సిపిఎం పోరాటం
- మాట నిలబెట్టుకోకపోతే మరోసారి ఉద్యమిస్తామని హెచ్చరిక



స్థానికులతో కలిసి నిరసన శిబిరంలో పాల్గొన్న సిపిఎం జిల్లా నాయకులు వి.లక్ష్మి, జెడ్‌పిటిసి రాజేశ్వరి



ఎస్‌ఐతో మాట్లాడుతున్న నిర్వాసితులు

ప్రజాశక్తి - దత్తిరాజేరు / విజయనగరం ప్రతినిధి

దత్తిరాజేరు మండలం పెదమానాపురం రైల్వే ట్రాక్ నిర్వాసితులకు 100రోజుల్లో భూమి సేకరించి, ఇళ్ల పట్టాలు మంజూరు చేసేందుకు స్థానిక తహశీల్దార్ విజయ భాస్కర్ హామీ ఇచ్చారు. దీంతో, సిపిఎం ఆధ్వర్యాన చేపట్టిన పోరాటం ఫలించినట్లైంది. మాట నిలబెట్టుకోకపోతే, మరో పోరాటం తప్పదని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వి.లక్ష్మి హెచ్చరించారు. విజయనగరం నుంచి గజపతినగరం మీదుగా బొబ్బిలి వైపు తలపెట్టిన మూడో రైల్వే లైను నిర్మాణ పనుల్లో భాగంగా మానాపురం గ్రామంలో సుమారు 32కుటుంబాలు నిర్వాసితులుగా మారారు. ఇందులో 28 కుటుంబాలవారు పక్కా ఇళ్లను కోల్పోయారు. వారందరికీ తూతూ మంత్రంగా నష్టపరిహారం చెల్లించి ప్రభుత్వం చేతులు దులుపుకుంది. అక్కడి అధికార, ప్రతిపక్ష పార్టీలూ పట్టించుకోలేదు. దిక్కుతోచని పరిస్థితుల్లోవున్న ఆయా కుటుంబాలు సిపిఎంను ఆశ్రయించడంతో ఆ పార్టీ నాయకులు గొర్లె శ్రీనివాస్ ఆధ్వర్యాన నెల రోజుల క్రితమే స్థానిక తహశీల్దార్, ఆర్‌డిఒ, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. అప్పటికీ వారు స్పందిచలేదు. మరోవైపు రైల్వే అధికారుల విజ్ఞప్తి మేరకు అధికార యంత్రాంగం ఇళ్ల తొలగింపునకు ఏకపక్ష నిర్ణయం తీసుకుంది. పొక్లెయినర్లతో ఇళ్లను తొలగించేందుకు అధికారులు గురువారమే సమాయత్తమయ్యారు. దీంతో, రంగంలోకి దిగిన సిపిఎం నాయకులు బాధితులకు అండగా నిలబడింది. బాధితుల తరపున మానాపురం గ్రామస్తులను సమీకరించింది. సిపిఎం నాయకులు శ్రీనివాస్ బాధితులతో కలిసి తొలగింపు చర్యలను అడ్డుకున్నారు. ప్రభుత్వ అక్రమ చర్యలకు నిరసనగా నిరసన దీక్షకు సిద్ధమయ్యారు. ఇళ్లు తొలగిస్తే తాడోపేడో అన్న రీతిలో బాధితులు నిరసన దీక్షా శిబిరంలో భీష్మించుకు కూర్చున్నారు. శిబిరాన్ని భగ్నంచేసి, ఇళ్లను కూల్చేందుకు అధికార యంత్రాంగం పోలీసులను ఉసిగొల్పింది. ఇదే వ్యూహంతో గజపతినగరంలో సిపిఎం నాయకుడు రాకోటి రాములును పోలీసులు ఆయన ఇంటి వద్ద అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. సిఐ జివివి రమణ ఆధ్వర్యాన మానాపురం ఎస్.జయంతితోపాటు గజపతినగరం, బొండపల్లి, బూర్జవలస, ఎస్‌ఐలు, వందల సంఖ్యలో పోలీసులు దీక్షా శిబిరం వద్ద మోహరించారు. అప్పటికే సిపిఎం నాయకులు శ్రీనివాస్‌తోపాటు ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వి.లక్ష్మి అక్కడికి చేరుకొని ఇళ్లను తొలగిస్తే ఊరుకునేది లేదని, ఇళ్ల స్థలాల సంగతి తేలేవరకు ఇక్కడి నుంచి కదిలేది లేదని హెచ్చరించారు. మరోవైపు ఊరంతా ఒక్కటై బాధిత కుటుంబాలకు అండ నిలబడింది.

వైసిపికి చెందిన జెడ్‌పిటిసి సభ్యులు రౌతు రాజేశ్వరి కూడా శిబిరం వద్దకు వచ్చి బాధితులకు అండగా ఉంటామని చెప్పారు. 'జైలుకైనా వెళ్తాం కానీ, తమ ఇళ్లను కూల్చితే ఊరుకునేది లేదు' అంటూ బాధితుల ఆగ్రహం కట్టలు తెంచుకుంది. ఇంకోవైపు శిబిరాన్ని భగ్నం చేయడంతోపాటు సిపిఎం సహా బాధితులందర్నీ అరెస్టులు చేసేందుకు మాటువేసి ఉన్న పోలీసులకు ఏం చేయాలో అర్థకాని పరిస్థితి. ఇక్కడి పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించిన ఎస్‌పికి సైతం ఏం చేయాలో అర్థం కాని పరిస్థితి. అప్పటికి సమయం మధ్యాహ్నం ఒంటిగంట దాటింది. అప్పటి వరకు 'తమకు సంబంధం లేదు....అంతా రైల్వే చూసుకోవాల్సింది' అన్నట్టుగా వ్యవహరించిన తహశీల్దార్ విజయ్‌భాస్కర్ ఆర్‌డిఒను సంప్రదించి అనంతరం శిబిరం వద్దకు వచ్చి 100 రోజుల్లో ఇళ్ల స్థలాలు ఇస్తామని, ఈలోపే భూమిని సేకరిస్తామని హామీ ఇచ్చారు. బాధితుల్లో కొందరు ప్రభుత్వ సాయంతోనే ఇళ్లు కట్టుకుని ఉండవచ్చుని, అటువంటి వారికి తిరిగి ఇవ్వబోమంటే బాధితులు మరింత అన్యాయమైపోతారని సిపిఎం శ్రీనివాస్ ప్రశ్నించారు. ఎలాంటి షరతులూ లేకుండానే బాధితులందరికీ ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. దీనికి స్పందించిన తహశీల్దార్ గతంలో పొందిన పట్టాలతో సంబంధం లేకుండానే ఇళ్లను మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. 12వ తేదీ లోపు ఇళ్లు ఖాళీ చేయాలని ఆయన కోరారు. స్థలాలు ప్రభుత్వం తరఫున ఇచ్చి, తాము నిర్మాణం పూర్తిచేసుకునే లోపు తాము ఎక్కడ తలదాచుకోవాలని బాధితులు ప్రశ్నించారు. స్థానిక కోనేటి వద్ద గుడారాలు ఏర్పాటు చేసేందుకు అవకాశం కల్పిస్తామని తహశీల్దార్ హామీ ఇచ్చారు. దీంతో, బాధితులు, సిపిఎం నాయకులు ఆందోళన విరమించారు. ఇచ్చిన మాట ప్రకారం 100రోజుల్లో ఇళ్ల స్థలాలు ఇవ్వకపోతే రైళ్లను స్తంభింపజేయాల్సి వస్తుందని వారంతా హెచ్చరించారు.



పనులు ప్రారంభించేందుకు రైల్వేట్రాక్ వద్ద మోహరించిన పోలీసులు

పేదరిక నిర్మూలనకు పి4 విధానం

నిరుపేదలను గుర్తించేందుకు సర్వే : కలెక్టర్ బిఆర్ అంబేద్కర్

ప్రజాశక్తి-విజయనగరంకోట

స్వర్ణాంధ్ర 2047 విజన్ ప్లాన్‌లో భాగంగా పేదరిక నిర్మూలనకు పి4 విధానంతో కార్యాచరణ రూపొందించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆదేశించారు. మండల ప్రత్యేకాధికారులు, జిల్లా అధికారులు, ఎంపిడిఒలతో కలెక్టరేట్ నుంచి శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఉగాది రోజున ముఖ్యమంత్రి ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారని, దీనికి సమాయత్తం కావాలని కోరారు. స్వర్ణాంధ్ర విజన్ ప్లాన్‌లో భాగంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు నియోజకవర్గాల వారీగా అభివృద్ధి ప్రణాళికలను రూపొందించాలని కలెక్టర్ ఆదేశించారు. దీనికోసం ప్రతీ నియోజకవర్గానికి ఒక ప్రత్యేకాధికారిని నియమిస్తామని చెప్పారు. జిల్లాలో అమల్లో ఉన్న ఎన్నికల కోడ్‌ను దృష్టిలో పెట్టుకొని కార్యక్రమాలను రూపొందించాలని సూచించారు. సున్నా పేదరికమే లక్ష్యంగా ఉగాదినుంచి అమలు కానున్న పి4 కార్యక్రమం కోసం, సర్వే ద్వారా సమాజంలో అట్టడుగున ఉన్న అతి నిరుపేద జాబితాలు తయారు చేయాలని చెప్పారు. దీనిపై ఫీడ్‌బ్యాక్ సర్వే కూడా జరుగుతుందని, జిల్లా నుంచి సుమారు లక్ష మందికి పైగా ఈ సర్వేలో పాల్గొనేలా చూడాలని ఆదేశించారు. జిల్లాలో జరుగుతున్న ఎంఎస్ఎంఇ సర్వేపై కలెక్టర్ సమీక్షించారు. సిపిఒ పి.బాలాజీ మాట్లాడుతూ పి4 సర్వే 22వ తేదీలోగా పూర్తి చేయాలని చెప్పారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టరేట్ నుంచి జెసి సేతు మాధవన్, డిఎంఅండ్‌హెచ్ఓ జీవనరాణి పాల్గొన్నారు.



తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న సిఐటియు నాయకులు, కార్మికులు

లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని ఆందోళన

ప్రజాశక్తి-భోగాపురం

కార్మిక చట్టాలను పూర్తిగా రద్దు చేసే వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్లను తీసుకువస్తే కార్మిక రంగానికి తీవ్ర నష్టం వాటిల్లుతుందని సిఐటియు జిల్లా కార్యదర్శి బి.సూర్యనారాయణ ఆందోళన వ్యక్తంచేశారు. లేబర్ కోడ్లను రద్దు చేయాలని కోరుతూ భోగాపురంలో శుక్రవారం ఆందోళన చేపట్టారు. తొలుత ముక్కాం కూడలి నుంచి జాతీయ రహదారి మీదుగా తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయం ఎదుట లేబర్ కోడ్లను రద్దు చేయాలని నినాదాలు చేశారు. అధికారులకు వినతి పత్రం అందజేశారు. ఈ ర్యాలీలో టోల్ గేట్ సిబ్బంది, మధ్యాహ్న భోజన పథక నిర్వాహకులు, ఆటో డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.

బెల్టుషాపులను నియంత్రించాలి

ఎక్సైజ్ అధికారులకు కలెక్టర్ ఆదేశాలు

ప్రజాశక్తి-విజయనగరం కోట

జిల్లాలో పలు ప్రాంతాల్లో బెల్టు షాపుల ద్వారా మద్యం విక్రయాలు జోరుగా జరుగుతున్నట్టు సమాచారం వుందని, దీనిపై ఎక్సైజ్ శాఖా పరంగా తక్షణం చర్యలు చేపట్టి వాటిని నియంత్రించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆ శాఖ సూపరింటెండెంట్‌ను ఆదేశించారు. జిల్లాలో ఏయే ప్రాంతాల్లో బెల్టుషాపులు నడుస్తున్నాయన్న సమాచారం తనవద్ద వుందని, వాటిని ఎక్సైజ్‌శాఖ నియంత్రించలేని పక్షంలో తాను చర్యలు చేపట్టవలసి వస్తుందన్నారు. జిల్లా అధికారులతో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఎక్సైజ్ శాఖపై సమీక్షించారు. పలుచోట్ల మద్యం దుకాణాల వద్దే బహిరంగంగా మద్యం సేవిస్తూ ప్రజలకు అసౌకర్యం కలిగిస్తున్నట్టు ఫిర్యాదులు వున్నాయని, అటువంటి దుకాణాలపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.



మెంటాడ.. పిడిఎఫ్ అభ్యర్థి విజయగౌరికి మద్దతుగా ప్రచారం చేస్తున్న యుటిఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి ఈశ్వరరావు

విజయగౌరికి మద్దతుగా ప్రచారం

ప్రజాశక్తి- మెంటాడ

పిడిఎఫ్ ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరికి మద్దతుగా మెంటాడ మండలంలో శుక్రవారం యుటిఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి జెఎవిఆర్‌కె ఈశ్వరరావు ప్రచారం చేశారు. మండలంలో మెంటాడ, జిటిపేట, ఆంధ్ర, కెజిబివి, గిరిజన ఆశ్రమ పాఠశాల, చల్లపేట, జయితి, పోరాం పాఠశాలల్లో ఉపాధ్యాయులను కలిసి, విజయగౌరికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కోశాధికారి చింత భాస్కరరావు, మండల అధ్యక్షులు కాళ్ల సన్యాసిరావు, ప్రధాన కార్యదర్శి కొండపల్లి సత్యనారాయణ, సహాధ్యక్షులు చింత వెంకట రవికుమార్ పాల్గొన్నారు.

కొత్తవలస : పిడిఎఫ్ ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి విజయగౌరికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని యుటిఎఫ్ నాయకులు కోరారు. వియ్యంపేటలోని ఎపిఎస్‌డబ్ల్యుఆర్ ఉపాధ్యాయులను కలిసి విజయగౌరికి మద్దతివ్వాలని కోరారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా నాయకులు జి.వెంకటి నాయుడు, జి.పార్వతి, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.విజయగౌరి, సిహెచ్.నిర్మలదేవి, సహాధ్యక్షులు వి.సురేష్ కుమార్ పాల్గొన్నారు.

పంటల సాగు విస్తీర్ణం పెరగాలి

- వినియోగంలో లేని 1.12 లక్షల ఎకరాలను సాగుకు యోగ్యంగా చేయాలి
- స్కూళ్లు తెరిచేలోగా హాస్టళ్ల మరమ్మతులు పూర్తిచేయాలి
- కలెక్టర్ అంబేద్కర్ ఆదేశాలు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బిఆర్ అంబేద్కర్

ప్రజాశక్తి-విజయనగరం కోట

వ్యవసాయ రంగంలో 15శాతం వృద్ధిరేటు సాధించేందుకు జిల్లాలో పంటల సాగు విస్తీర్ణం పెంచే దిశగా చర్యలు చేపట్టాల్సి వుందని కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులకు స్పష్టంచేశారు. జిల్లాలో సాగుకు యోగ్యమైన, వినియోగంలో లేని 1.12 లక్షల ఎకరాల భూమిని వచ్చే రెండు మూడేళ్లలో పంటల సాగుకు అనువుగా రూపొందించడం ద్వారా ఈ లక్ష్యాలను సాధించగలమని పేర్కొన్నారు. జిల్లాలో భూగర్భ జలాలు సమృద్ధిగా వున్నాయని, వీటిని వినియోగించి వృథాగా వున్న భూమిని సాగులోకి తెచ్చే ప్రయత్నం చేయాలన్నారు. ఈ దిశగా వ్యవసాయ, ఉద్యాన శాఖలు ప్రస్తుత రబీ సీజను నుంచే చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కొత్తగా వినియోగంలోకి తెచ్చే భూముల్లో రైతుకు మంచి ఆదాయం తీసుకువచ్చే వాణిజ్య పరంగా లాభసాటిగా వుండే ఉద్యాన పంటల సాగును ప్రోత్సహించాలని చెప్పారు.

జిల్లాలో వివిధ ప్రభుత్వ శాఖల ద్వారా అమలు జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి ఏడాది ప్రగతి లక్ష్యాల సాధనపై కలెక్టర్ అన్ని శాఖల అధికారులతో శుక్రవారం సమీక్షించారు. జిల్లాలో రైతులందరితో పంటల బీమా చేయించాలన్నారు. వచ్చే రెండేళ్లలో సాగునీటి వసతివున్న, వర్షాధారంగా వున్న 26,748 ఎకరాల వినియోగంలోలేని భూములను సాగులోకి తీసుకువచ్చేందుకు చర్యలు చేపట్టామని వ్యవసాయ శాఖ జిల్లా అధికారి వి.టి.రామారావు చెప్పారు. పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో గ్రామాల్లో రైతులతో గోకులాలు ఏర్పాటు చేసేందుకు ప్రోత్సహించాలని కలెక్టర్ పశుసంవర్ధక శాఖ అధికారులను ఆదేశించారు. పూర్తి నాణ్యత ప్రమాణాలతో గోకులాలు నిర్మించేందుకు తగిన చొరవ చూపాలని సూచించారు. జిల్లాలో పారిశ్రామికాభివృద్ధిలో భాగంగా అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఎం.ఎస్.ఎం.ఇ. పార్కులు ఏర్పాటు చేసేందుకు స్థలాలను గుర్తించామని కలెక్టర్ చెప్పారు. జిల్లా కేంద్రం మినహా అన్ని నియోజకవర్గాల్లో ఈ పార్కుల ఏర్పాటుకు అవసరమైన భూమిని అందజేస్తూ ప్రతిపాదనలు చేస్తామన్నారు. జిల్లాలో స్వయంశక్తి మహిళలు తయారు చేసిన ఉత్పత్తులకు మార్కెటింగ్ సదుపాయాలు కల్పించడంలో భాగంగా ప్రధానమైన రహదారుల వెంబడి 50 స్టోర్లను ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు రూపొందించామని డిఆర్‌డిఎ పీడీ ఎ.కళ్యాణచక్రవర్తి చెప్పారు. జిల్లాలో సాంఘిక సంక్షేమశాఖకు సంబంధించి 23 హాస్టళ్ల మరమ్మత్తులకు రూ.4.65 కోట్లు, బి.సి.హాస్టళ్ల మరమ్మత్తులకు రూ.60 లక్షలు మంజూరు చేశామని ఈ పనులను త్వరగా పూర్తిచేయాలని కలెక్టర్ చెప్పారు.

సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్.సేతు మాధవన్, సిపిఒ పి.బాలాజీ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఒడిశా సిఎం వ్యాఖ్యలపై నిరసన

గిరిజన మహిళలకు క్షమాపణ చెప్పాలని ఐద్వా డిమాండ్

ప్రజాశక్తి-మెంటాడ



నిరసన తెలుపుతున్న ఐద్వా నాయకులు, మహిళలు

గిరిజన మహిళలనుద్దేశించి ఒడిశా సిఎం చేసిన అనుచిత వ్యాఖ్యలపై మండలంలోని లోతుగడ్డ గ్రామంలో ఐద్వా ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా కార్యదర్శి పి.రమణమ్మ, సహాయ కార్యదర్శి ఆర్.హరికృష్ణవేణి మాట్లాడుతూ గిరిజన మహిళలు అందంగా ఉండరని, అందుకే తాను పెళ్లి చేసుకోలేదంటూ ఒడిశా సిఎం మోహన్ చరణ్ మాఝీ చేసిన వ్యాఖ్యలు.. మహిళల మనోభావాలను దెబ్బతీసేలా ఉన్నాయని ఆగ్రహం వ్యక్తంచేశారు. మహిళలకు రక్షణ కల్పించాల్సిన ముఖ్యమంత్రి ఈ విధంగా మాట్లాడటం సిగ్గుచేటన్నారు. మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మనువాద సిద్ధాంతం ముందుకు తెచ్చి, మహిళలు వంటింటికే పరిమితం కావాలంటూ, ఏ దుస్తులు వేసుకోవాలో ఆంక్షలు పెట్టి మహిళల్ని చులకనగా చూసే సంస్కృతి పెరిగిందన్నారు. వెంటనే మహిళలందరికీ ఒడిశా సిఎం క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా కమిటీ సభ్యులు సిహెచ్ కృష్ణవేణి, పావని, రాములమ్మ, కృష్ణవేణి, మంగవేణి పాల్గొన్నారు.

బాక్సింగ్ పోటీలకు 10 మంది ఎంపిక

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిల్లా సీనియర్స్ ఉమెన్ బాక్సింగ్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక శుక్రవారం స్థానిక రాజీవ్ స్టేడియంలో జరిగింది. 20మంది బాలికలు ఆయా విభాగాల్లో పాల్గొనగా పది విభాగాల్లో పది మందిని ఎంపిక చేశారు. ఎంపికైన క్రీడాకారులు, ఈనెల 11, 12 తేదీలలో విశాఖపట్నం లో జరగబోవు 8వ రాష్ట్రస్థాయి , బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లోపాల్గొంటారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు డోల మన్మధకుమార్, బాక్సింగ్ అసోసియేషన్ సభ్యులు జిల్లా అధ్యక్షులు గరి శ్రీనివాసరావు , కార్యదర్శి ఇందుకూరి అశోక్ రాజు, ఎస్ఇ రాజు, రాకేష్ కుమార్, కె.సూర్య వర్ధన్ రెడ్డి, వి. మల్లేష్, జిల్లా ఒలింపిక్స్ అసోసియేషన్ సభ్యులు, శాప్ కోచ్ బి.ఈశ్వరరావు , బాక్సింగ్ రింగ్ అఫిషియల్స్ వి.సంతోష్ కుమార్, పి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వసతిగృహంపై పర్యవేక్షణ కరువు

ఇష్టానుసారంగా తిరుగున్న విద్యార్థులు! ● రోడ్డు ప్రమాదంలోఒకరి మృతికి కారణమైన విద్యార్థి

ప్రజాశక్తి-బొబ్బిలి



ఎస్‌సి బాలుర కళాశాల వసతిగృహం

బొబ్బిలి గ్రోత్‌సెంటర్ సమీపంలో ఉన్న ఎస్‌సి బాలుర కళాశాల వసతిగృహంపై వార్డెన్, జిల్లా అధికారుల పర్యవేక్షణ కరువైంది. దీంతో విద్యార్థులు ఇష్టానుసారంగా బయట తిరుగుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. హాస్టల్‌ను, అక్కడి విద్యార్థులను కంటికి రెప్పలా కాపాడుకోవాల్సిన వార్డెన్.. పూర్తిగా పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వస్తున్నాయి. దీంతో విద్యార్థులు ఏ సమయంలో బయటకు వెళ్తారో, ఎప్పుడు హాస్టల్‌కు వస్తారో తెలియని పరిస్థితి నెలకొంది. మూడు రోజుల క్రితం బొబ్బిలి గెస్ట్‌హౌస్ గేటు వద్ద హాస్టల్ విద్యార్థి రోడ్డు ప్రమాదంలో నిండు ప్రాణాన్ని బలి తీసుకున్నాడు. కళాశాల నుంచి హాస్టల్‌కు వచ్చిన విద్యార్థి అభి.. అక్కడ వార్డెన్ లేకపోవడంతో ద్విచక్ర వాహనంపై బొబ్బిలి పట్టణానికి వెళ్లాడు. తిరిగి హాస్టల్‌కు వస్తుండగా గెస్ట్‌హౌస్ గేటు వద్ద ఉన్న టీషాపులో టీ తాగేందుకు వెళ్తున్న ఇద్దరిని బలంగా ఢీకొన్నాడు. దీంతో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. హాస్టల్ విద్యార్థి అభికి కూడా గాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడిన కొమరాడ మండలం గుమడకు చెందిన షేక్ లాల్‌బి విజయనగరంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించాడు. హాస్టల్‌లో ఉండాల్సిన వార్డెన్, నైట్ వాచ్‌మెన్ లేకపోవడంతోనే విద్యార్థులు ఇష్టానుసారంగా బయట తిరుగుతున్నారని ఆరోపణలు ఉన్నాయి. కొంతమంది విద్యార్థులు మద్యం కూడా సేవిస్తున్నారని సమాచారం. హాస్టల్‌లో సక్రమంగా పని చేయని వారిపై చర్యలు తీసుకోవాలని, పర్యవేక్షణ సరిగా చేయాలని విద్యార్థులు తల్లిదండ్రులు కోరుతున్నారు.

వికలాంగుల సంక్షేమశాఖ ఎడిగా కుమారస్వామి

ప్రజాశక్తి-విజయనగరంకోట



విభిన్న ప్రతిభా వంతుల శాఖ ఎడిగా కె.కుమార స్వామి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం జిల్లా పర్యాటక అధికారిగా వున్న కుమార స్వామి విభిన్న ప్రతిభా వంతుల శాఖ ఎడి బాధ్యతలు కూడా నిర్వహిస్తారు. ఈ శాఖ ఎడి జగదీష్ ఇటీవల బదిలీపై వెళ్లిన నేపథ్యంలో ఈ శాఖ బాధ్యతలను పర్యాటక శాఖ అధికారికి అప్పగించారు.

శ్రీనివాసులునాయుడు నామినేషన్ దాఖలు

విజయనగరం టౌన్ : ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు నాయుడు శుక్రవారం నామినేషన్ దాఖలు చేశారు. విశాఖపట్నం కలెక్టరేట్ నామినేషన్ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన ర్యాలీలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

10.5 కిలోల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని పాటూరులో రాజుచెరువు వద్ద 10.5 కిలోల గంజాయి ప్యాకెట్లను శుక్రవారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గంజాయి ప్యాకెట్లు ఎవరో విడిచి వెళ్లిపోయారని గ్రామస్తులు ఇచ్చిన సమాచారం మేరకు ఎస్ఐ బి.దేవి అక్కడికి చేరుకుని, స్వాధీనం చేసుకున్నారు.

పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారానికి చర్యలు

ప్రజాశక్తి-విజయనగరంకోట

జిల్లా పోలీసుశాఖలో వివిధ హోదాల్లో పని చేస్తున్న పోలీసు అధికారులు, సిబ్బంది సమస్యల పరిష్కారానికి జిల్లా ఎస్‌పి వకుల్ జిందాల్ శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో వెల్ఫేర్ డే నిర్వహించారు. సిబ్బంది నుంచి వినతులు స్వీకరించి సానుకూలంగా స్పందించారు. పోలీసు సంక్షేమానికి ప్రాధాన్యత కల్పిస్తానన్నారు.



హోంగార్డు కుటుంబానికి ఆర్థిక సాయం చెక్కును అందజేస్తున్న ఎస్‌పి వకుల్

హోంగార్డు కుటుంబానికి చేయూత

ఇటీవల మరణించిన హోంగార్డు కుటుంబానికి చేయూతను అందించేందుకు హోంగార్డు సిబ్బంది సమకూర్చిన ఒక్క రోజు డ్యూటీ అలవెన్సు చెక్‌ను ఎస్‌పి వకుల్ జిందాల్ మృతుడి కుటుంబ సభ్యులకు అందజేశారు. జిల్లాలో హోంగార్డుగా ఎంపికై స్టీల్‌ప్లాంట్‌లో పనిచేస్తున్న విజయనగరం తోటపాలెం వైఎస్ఆర్ కాలనీకి చెందిన బి.జగదీశ్వరరావు డిసెంబర్ 13న అనారోగ్యంతో మృతి చెందారు. ఈనేపథ్యంలో ఆ కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకొనేందుకు హోంగార్డులు సమకూర్చిన ఒక్క రోజు డ్యూటీ అలవెన్సు రూ.3,25,890 చెక్‌ను అతని తల్లి బి.హైమావతికి ఎస్‌పి అందజేశార. కుటుంబ సభ్యుల్లో ఒకరికి హోంగార్డుగా నియమించేందుకు, కుటుంబ సంక్షేమానికి కృషి చేస్తామని ఎస్‌పి తెలిపారు. కార్యక్రమంలో హోంగార్డ్సు ఇన్చార్జి ఆర్ఐ ఆర్.రమేష్ కుమార్, డిపిఒ సూపరింటెండెంట్ ఎ.ఎస్.వి.ప్రభాకర రావు పోలీసు కుటుంబ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

యాత్రికులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు

ప్రజాశక్తి-శృంగవరపుకోట

మహాశివరాత్రి సందర్భంగా పుణ్యగిరి, సన్యాసయ్యపాలెం వచ్చే యాత్రికులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలని తహశీల్దార్ అరుణకుమారి.. అధికారులను ఆదేశించారు. మహాశివరాత్రి ఏర్పాట్లపై శుక్రవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో అధికారులతో ఆమె సమీక్షించారు. శివరాత్రి రోజున మద్యం అమ్మకాలు లేకుండా చూడాలని ఎక్సైజ్ సిఐ సిహెచ్ రాజేష్‌కు తహశీల్దార్ సూచించగా, కలెక్టర్ అనుమతి తీసుకోవాలని ఆయన చెప్పారు. అందుకు వీలు కాకపోతే కనీసం బెల్టుషాపులనైనా మూయించాలని ఎక్సైజ్ సీఐను తాసిల్దార్ కోరారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి లక్ష్మి పాల్గొన్నారు.



గ్రామ నాయకులతో మాట్లాడుతున్న వైద్యులు

వైద్య సిబ్బందిపై దాడిచేస్తే చర్యలు తప్పవు

ప్రజాశక్తి-లక్కవరపుకోట

విధుల్లో ఉన్న వైద్య సిబ్బందిపై దాడులు చేస్తే చర్యలు తప్పవని వైద్యులు అనిల్‌కుమార్, అజయ్‌కుమార్ తెలిపారు. మండలంలోని రేగ పంచాయతీ పరిధిలోని నీలకంఠపురంలో ఆశా కార్యకర్తపై గురువారం మద్యం మత్తులో ఓ వ్యక్తి దాడి చేసిన విషయం తెలిసిందే. ఈ మేరకు శుక్రవారం రేగ సచివాలయంలో వైద్య సిబ్బంది, సర్పంచ్ రావాడ నీలకంఠం, ఎంపిటిసి బొడ్డు గణపతి, నాయకులతో వారు సమావేశమయ్యారు. పంచాయతీ పరిధిలో ఆశా కార్యకర్తలు, ఎఎన్ఎంపై కొంతమంది ఎప్పటికప్పుడు దాడులు చేస్తున్నారని వైద్యులు ఆందోళన వ్యక్తంచేశారు. గ్రామ పెద్దలుగా చర్యలు తీసుకోవలసిన బాధ్యత ఉందని గుర్తు చేశారు. ఆశా కార్యకర్తపై దాడికి పాల్పడిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని తెలిపారు. సర్పంచ్, ఎంపిటిసి స్పందిస్తూ ఇకపై ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూసుకుంటామని తెలిపారు. ఆశా వర్కర్ మీద దాడి చేసిన ఎర్ర అప్పారావును పోలీసుస్టేషన్‌కు అప్పగిస్తామని చెప్పారు.

తల్లిదండ్రులకు 'నారాయణ' బెదిరింపులు

ప్రజాశక్తి-శృంగవరపుకోట

విద్యార్థుల తల్లిదండ్రులను నారాయణ పాఠశాల యాజమాన్యం బెదిరింపులకు పాల్పడుతోందని న్యాయవాది బొబ్బిలి రామకృష్ణ తెలిపారు. శుక్రవారం పట్టణంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ నాలుగు సంవత్సరాలుగా నారాయణ పాఠశాల గుర్తింపు లేకుండానే ప్రభుత్వం దృష్టిలో కేంబ్రిడ్జి పాఠశాలగానే మనుగడ సాగిస్తూనే తల్లిదండ్రులను, విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు. తమ పిల్లలను నారాయణ పాఠశాల ఇతర శాఖలకు బదిలీ చేయాలనుకున్నా, పాఠశాల మార్చాలనుకున్నా ఫీజుల బకాయిలు ఉండకూడదని సర్క్యులర్ ఇవ్వడం దారుణమన్నారు. బకాయిలు ఉంటే టిసి బదిలీ చేయబోమని చెబుతున్నారని తెలిపారు. విద్యాహక్కు చట్టం నిబంధనలకు వ్యతిరేకంగా పనిచేస్తున్న నారాయణ పాఠశాల యాజమాన్యంపై విద్యాశాఖాధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

వాటర్ ప్లాంట్ ప్రారంభం

ప్రజాశక్తి-తెర్లాం

మండలంలోని తెర్లాం జంక్షన్‌లో ఏర్పాటుచేసిన వాటర్ ప్లాంట్‌ను ఎమ్మెల్యే బేబినాయన, బుడా చైర్మన్ తెంటు లక్ష్మునాయుడు శుక్రవారం ప్రారంభించారు. వెలగవలసకు చెందిన టిడిపి కార్యకర్త ఉత్తరావల్లి ఆదినారాయణ ఈ వాటర్‌ప్లాంట్‌ను నిర్మించారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు వెంకట నాయుడు, వెంకటేశ్వరరావు, ఎస్.శశి, ఎంపిటిసి ఆనందరావు పాల్గొన్నారు.



వాటర్ ప్లాంట్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

పన్ను వసూళ్లలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

ప్రజాశక్తి-బొబ్బిలి

పన్నుల వసూళ్లలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి హెచ్చరించారు. తన కార్యాలయంలో శుక్రవారం పన్నుల వసూళ్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సచివాలయాల వారీగా ఇంటింటికి వెళ్లి పన్ను వసూలు చేయాలన్నారు. ఇంటి పన్ను, ఖాళీ స్థలాల పన్ను, కుళాయి పన్నులు వసూలు చేయాలని ఆదేశించారు. లక్ష్యాలను చేరుకోకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మున్సిపల్ ఆర్థిక వ్యవస్థను పటిష్ట పరుచుకునే దిశగా చేపడుతున్న జిఐఎస్ సర్వే వారం రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు.

స్త్రీనిధి రుణాల రికవరీకి చర్యలు

ప్రజాశక్తి-రేగిడి

గ్రామాల్లో మహిళా స్వయం శక్తి సంఘాలకు అందించిన స్త్రీనిధి, ఉన్నతి రుణాలను వంద శాతం రికవరీ చేయాలని ఏరియా కోఆర్డినేటర్ ఎ.చిరంజీవి అన్నారు. శుక్రవారం వెలుగు కార్యాలయంలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హత గల సంఘాలకు బ్యాంకు లింకేజీ రుణాలు అందేటట్లు సిబ్బంది కృషి చేయాలన్నారు. ఫిబ్రవరి నెలాఖరులోపు అనుకున్న లక్ష్యాలను పూర్తి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఎపిఎం బి.గోవిందరావు, ఫైనాన్స్ ఎపిఎం కె.హేమలత ఉన్నారు.

రైతుల పాలిట కల్పవృక్షం ఆయిల్‌పాం

ప్రజాశక్తి-కొత్తవలస

రైతుల పాలిట కల్పవృక్షం ఆయిల్‌పాం పెంపకమని ఉద్యాన శాఖ అధికారి పి.పద్మ అన్నారు. శుక్రవారం కొత్తవలసలో వ్యవసాయ, ఉద్యానశాఖ సంయుక్తంగా నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. కొత్తగా ఆయిల్‌పాం సాగుకు ముందుకొస్తే రైతు సేవా కేంద్రాన్ని సంప్రదించాలన్నారు. మండలానికి శ్రీనివాస ఆయిల్స్ మిల్లును కేటాయించారని తెలిపారు. ఒక్కొక్క ఖరీదు రూ.193 అని, 100 శాతం సబ్సిడీతో మొక్కలను ఎన్ఎంఇఒ పథకం కింద కంపెనీ అందిస్తుందని చెప్పారు. సమావేశంలో మండల వ్యవసాయ అధికారి మాధురి శరణ్య, ఎఇఒ రమణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని సింగరాయి గ్రామంలో దోమల నివారణకు హెల్త్ సెంటర్ సిబ్బంది చర్యలు చేపట్టారు. బుధవారం కాలువల్లో మురుగునీరు నిల్వ లేకుండా శుభ్రం చేయించారు. దోమల నివారణకు పిచికారీ చేపట్టారు. పరిసరాల పరిశుభ్రతపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎఎన్ఎం వెంకటలక్ష్మి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రామాల్లో సిసి కెమెరాలు ఏర్పాటు

ప్రజాశక్తి-నెల్లిమర్ల

నేర నియంత్రణకు పోలీసులు గ్రామాల్లో సిసి కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు. శుక్రవారం బొప్పడాం, పారసాం గ్రామాల్లో సర్పంచ్, షాప్ యజమానులు, ఆటో డ్రైవర్లు సహకారంతో నేరాలు నియంత్రణకు సిసి కెమెరాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ బి.గణేష్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు, చైన్ స్నాచింగ్, దొంగతనాలు, ఇతర నేరాలను నిరోధించుటకు సిసి కెమెరాలు ఉపయోగ పడతాయన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు సాయం

ప్రజాశక్తి-శృంగవరపుకోట

పట్టణంలోని రెల్లివీధిలో అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయి ధనాల శంకర్రావు కుటుంబానికి టిడిపి మండల అధ్యక్షులు జిఎస్ నాయుడు శుక్రవారం నిత్యావసర సరుకులు, దుస్తులు, నగదు అదించారు. కార్యక్రమంలో నాయకులు కాపుగంటి వాసు, పెడగడ రాజు, చక్కా కిరణ్ కుమార్, అనకాపల్లి చల్లయ్య, సరిపల్లి రామకృష్ణ, మోహన్, సరిస అప్పారావు, అప్పారావు పాల్గొన్నారు.



బాధిత కుటుంబానికి సాయమందిస్తున్న టిడిపి మండల అధ్యక్షులు జిఎస్ నాయుడు

ఆశాజనకంగా రబీ

- పెరిగిన అపరాల విస్తీర్ణం
- తగ్గిన వరి సాగు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి



ఈ ఏడాది రబీసాగు ఆశాజనకంగా కనిపిస్తోంది. నవంబర్, డిసెంబర్ నెలల్లో కూడా వర్షాలు కురవడంతో వివిధ పంటల సాగుకు వాతావరణం అదునునిచ్చింది. అయితే, వరి సాగు విస్తీర్ణం మాత్రం తగ్గింది. మిగిలిన మొక్కజొన్న, రాగులు, మినుములు, పెసలు, చెరకు తదితర పంటలు దాదాపు గత ఏడాది మాదిరిగానే సాగవుతున్నాయి. ఈ ఏడాది నవంబర్ నుంచి రబీ సీజన్ ప్రారంభమైంది. సాగునీటి వనరులు లేకపోవడం వల్ల ఈ సీజన్‌లో పంటలు నామ మాత్రంగానే పండుతాయి. ప్రధానంగా పెసలు, మినుములు, మొక్కజొన్న, చెరకు ఎక్కువగా సాగవుతాయి. వీటితోపాటు మొత్తంగా ఈఏడాది 24 పంటలు నమోదయ్యాయి. ఈ ఏడాది సాధారణ విస్తీర్ణం అన్ని పంటలూ కలుపుకుని 1,64,522 ఎకరాలు కాగా, ఇప్పటి వరకు 1,09,677 ఎకరాల్లో వివిధ పంటలు నమోదయ్యాయి. గత ఏడాది 1,17,422 ఎకరాలు నమోదైనప్పటికీ ఇదే రోజుకు 1,00,677 ఎకరాల్లో మాత్రమే సాగైంది. సీజన్ ఇంకా కొనసాగుతున్నందున ఈ ఏడాది కూడా గత ఏడాదికి తగ్గట్టు సాగు విస్తీర్ణం పెరిగే అవకాశాలు ఉన్నాయని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. మొక్కజొన్న సాధారణ విస్తీర్ణం 54,800 ఎకరాలు కాగా, 40,815 ఎకరాల్లో సాగైంది. గత ఏడాదితో పోలిస్తే 7వేల ఎకరాలు వెనుకబడి ఉన్నప్పటికీ, ఇదే రోజుతో పోలిస్తే సుమారు 300ఎకరాలు ఎక్కువ సాగే కనిపిస్తోంది. పెసలు గతేడాది 14,292 ఎకరాల్లో సాగవ్వగా, ఈ ఏడాది ఇప్పటి వరకు 14,475 ఎకరాలుగా నమోదైంది. ఇంకా స్వల్పంగా పెరిగే అవకాశాలు ఉన్నాయి. మినుములు గత సీజన్‌లో 35,490 ఎకరాల్లో పండగా, ఈ ఏడాది ఇప్పటి వరకు 39,280 ఎకరాల్లో సాగైంది. వరి, చెరకు సాగు మాత్రం తగ్గింది. వరి సాధారణ సాగు విస్తీర్ణం 6,597.5 కాగా, 1,317 ఎకరాల్లో మాత్రమే పడింది. అయితే, గత ఏడాదితో పోల్చుకుంటే సుమారు 250ఎకరాల మేర సాగు పెరిగింది. చెరకు గత ఏడాది 5,442 ఎకరాల్లో పడగా, ఈ ఏడాది 3,265 ఎకరాలకు పడిపోయింది. సాధారణ విస్తీర్ణంతో పోలిస్తే మరీ తక్కువగానే ఉంది.

జిల్లాలో పెద్దగా సాగునీటి వనరులు లేకపోవడం, రబీ పంటలు పూర్తిగా వర్షాధారమే. దీనికి తోడు పెరిగిన పెట్టుబడులు, మద్దతు ధర కల్పించకపోవడం వంటి కారణాల వల్ల వరి సాగుకు రైతులు సాహసించలేకపోతున్నారు. ఇక గతంలో భీమసింగి సుగర్ ఫ్యాక్టరీతోపాటు అటు లచ్చయ్యపేట సుగర్స్ కూడా చెరకు సేకరించేది. భీమసింగి సుగర్స్‌ను ఆధునీకరణ పేరుతో మూసేయడం తెలిసిందే. లచ్చయ్యపేట ఎన్‌సిఎస్ సుగర్ ఫ్యాక్టరీని నష్టాల పేరిట నిలిపివేశారు. దీంతో, చెరకు విస్తీర్ణం మూడేళ్లుగా తగ్గుముఖం పడుతూ వస్తోంది. ఇక పెసలు, మినుములు వంటి అపరాల పంటలకు కూడా తగిన ధర కల్పించకపోవడంతో ఏటా రైతుల శ్రమకు తగ్గ ఫలితం రావడం లేదు. అయినా, సరే నీటి ఆధారిత పంటలు కాకుండా అపరాలపై ఆశలు పెట్టుకుని రైతులు ముందుకు సాగుతున్నారు.

సూర్యఘర్‌పై అవగాహన కల్పించాలి

ప్రజాశక్తి-నెల్లిమర్ల

డ్వాక్రా మహిళలకు సూర్యఘర్ యోజన పథకంపై అవగాహన కల్పించాలని ఎడ్జ్ గ్రిడ్ సంస్థ అసిస్టెంట్ ఆపరేషనల్ మేనేజర్ వెంకటేశ్వరరావు తెలిపారు. శుక్రవారం స్థానిక వెలుగు కార్యాలయంలో ఏరియా కోఆర్డినేటర్ బంగారమ్మ ఆధ్వర్యంలో సూర్యఘర్ పథకంపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోలార్ సిస్టంతో విద్యుత్ పొదుపు పొదుపు చేయడానికి కేంద్ర ప్రభుత్వం సూర్యఘర్ యోజన పథకం ప్రవేశపెట్టిందన్నారు. ఈ పథకాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి అవగాహన కల్పించాలని కోరారు. ముఖ్యంగా సూర్యఘర్ యోజన పథకం అమలు చేయడానికి రాయితీపై రుణ సౌకర్యాన్ని ప్రభుత్వం కల్పిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎపిఎం ఎల్.పద్మ, హెచ్‌డి ఎపిఎం గీత, ఎస్ఎన్ మేనేజర్ నాయుడు, సిసిలు పాల్గొన్నారు.

డెంకాడ : డెంకాడ మండల సమాఖ్య కార్యాలయంలో సూర్యఘర్ పథకంపై విఒఎలు, సమాఖ్య నాయకులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎడ్జ్‌గ్రిడ్ సంస్థ ఆపరేషనల్ మేనేజర్ రాజేష్ మాట్లాడుతూ సోలార్ ప్యానెల్స్ గురించి అవగాహన, లబ్ధిదారుల వివరాలను పోర్టల్‌లో నమోదు చేసే విధానం, బ్యాంకు రుణాల ప్రాసెస్, సోలార్ పరికరాల వినియోగం, ప్రభుత్వ సహాయాలు, వాయిదాల విధానం తదితర అంశాలపై వివరించారు. డిఆర్‌డిఎ ఎపిడి సావిత్రి మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలు పర్యావరణ హితమైన సోలార్ ఎనర్జీ వైపు మళ్లేలా అవగాహన కల్పించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏరియా కోఆర్డినేటర్ రాజ్ కుమార్, జెడిఎం మార్టిన్, ఎపిఎం శ్రీనివాస్, సిసిలు పాల్గొన్నారు.

యుద్ధ ప్రాతిపదికన బోర్లకు మరమ్మతులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలో వేసవికాలంలో తాగునీటికి ఎద్దడి లేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నామని నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య స్పష్టం చేశారు. ఇప్పటికే మరమ్మతులకు గురైన బోరింగ్ పంపులను యుద్ధ ప్రాతిపదిక సరిచేస్తున్నామన్నారు. శుక్రవారం శ్రీనగర్ కాలనీ 52వ నెంబర్ సచివాలయ పరిధిలో మరమత్తులకు గురైన బోరింగ్ ను కమిషనర్ ఆదేశాల మేరకు సిబ్బంది బాగు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ పల్లి నల్లనయ్య మాట్లాడుతూ ఇప్పటికే పలు ప్రాంతాల్లో మరమ్మతులకు గురైన బోరింగులను బాగు చేయించామన్నారు. ప్రజలు కూడా సహకరించి బోరింగులను సరైన విధానంలో వినియోగించుకోవాలని చెప్పారు.

కాలువల్లో ప్లాస్టిక్,వ్యర్ధ పదార్థాలు వేయొద్దు

కాలువలలో చెత్తాచెదారాలను, ప్లాస్టిక్ వ్యర్థాలను ఎట్టి పరిస్థితుల్లో వేయరాదని ప్రజలకు విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య చెప్పారు. శుక్రవారం ప్రజారోగ్య సిబ్బంది ఒకటో నెంబర్ సచివాలయం సాకేటి వీధిలో ప్రధాన కాలువను జెసిబి సహాయంతో చెత్తను ప్రక్షాళన చేశారు. ప్లాస్టిక్ వ్యర్థాలను కాలవల్లో పారబోయడంతో అనేక ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. దీనివల్ల భవిష్యత్తులో కూడా తీవ్ర పరిణామాలు చోటు చేసుకుంటాయని ఆందోళన వ్యక్తం చేశారు.

డ్రై డే పాటించాలి

ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య సూచించారు. ఫ్రైడే డ్రైడే అనే నినాదంతో ప్రతి శుక్రవారం ఇంటి పరిసర ప్రాంతాలలో నిల్వ ఉన్న నీటిని పరిశుభ్రపరచుకోవాలని చెప్పారు. కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశాలతో సచివాలయ సిబ్బంది ప్రజలలో ఫ్రైడే డ్రైడే విధానంపై ప్రజల్లో చైతన్యం కల్పించారు. ప్రజల వద్దకు వెళ్లి నిల్వ ఉన్న నీటిని తొలగించి వేస్తూ అవగాహన కల్పించారు.

టిడిపిలో భారీగా చేరికలు

ప్రజాశక్తి-గజపతినగరం



టిడిపిలో చేరిన వారితో మంత్రి కొండపల్లి శ్రీనివాస్

దత్తిరాజేరు మండలం వంగర గ్రామ సర్పంచ్ దత్తి నారాయణ అప్పలనాయుడు తోపాటు ఆ గ్రామానికి చెందిన 50 కుటుంబాలు వైసిపిని వీడి మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సమక్షంలో శుక్రవారం టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్ వీరందరికీ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపిలు గంట్యాడ శ్రీదేవి, మక్కువ శ్రీధర్, టిడిపి రాష్ట్ర కార్యదర్శి పివివి గోపాలరాజు, మండల పార్టీ అధ్యక్షులు చప్ప చంద్రశేఖర్, కోరాడ కృష్ణ, ఈశ్వరరావు, వైకుంఠం ప్రదీప్ కుమార్, నాయకులు పాల్గొన్నారు.

విజయనగరం కోట : నగరంలో 3వ డివిజన్ పూల్‌బాగ్ వైసిపికి చెందిన 50 కుటుంబాలు శుక్రవారం టిడిపిలో చేరాయి. రాయితీ లక్ష్మణరావు గండ్రేడ్ సన్యాసిరావు ఆధ్వర్యంలో వీరంతా అశోక్‌బంగ్లాలో ఎమ్మెల్యే పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతిరాజు సమక్షంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజా సంక్షేమం, అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని టిడిపిలో చేరుతుండడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు ప్రసాద్ లక్ష్మీ వరప్రసాద్, రాజేష్ బాబు, పార్లమెంట్ మహిళా కార్యదర్శి అనురాధ బేగం తదితరులు పాల్గొన్నారు.



బంగారయ్యపేట పాఠశాలను పరిశీలిస్తున్న ఎంఇఒ నాగభూషణరావు

పాఠశాలల సందర్శన

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని బంగారయ్యపేట, కెజిపూడి, ఎస్‌కెఎస్‌పురం, పికెఆర్‌పురం, ఆర్ఎస్‌పేట, పెదగుడిపాల పాఠశాలలను ఎంఇఒలు నాగభూషణరావు, బాలభాస్కరరావు శుక్రవారం సందర్శించారు. పదో తరగతి విద్యార్థులు పబ్లిక్ పరీక్షలకు ఎలా సన్నద్ధమవుతున్నారో ఆరాతీశారు. పాఠశాలల రికార్డులు, మధ్యాహ్న భోజన పథకం అమలు, తరగతి గదులను పరిశీలించారు. పాఠశాలలకు ప్రహరీలున్నా గేట్లు లేకపోవడాన్ని గుర్తించి, సమస్యను ఉన్నతాధికారులకు తెలియజేస్తామని చెప్పారు.

రహదారి భద్రతపై అవగాహన

ప్రజాశక్తి-శృంగవరపుకోట

రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా ఆర్‌టిసి డిపో మేనేజర్ కె.రమేష్, డిగ్రీ కాలేజీ ప్రిన్సిపల్ కేశవరావు ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో విద్యార్థులకు రహదారి భద్రతపై అవగాహన కల్పించారు. అనంతరం ఇదే అంశంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందచేశారు. కార్యక్రమంలో డిపో సూపరింటెండెంట్ వెంకటరావు, అధ్యాపకులు ఈరన్న, వాసుదేవరావు, భాస్కర్ రావు, సుధీర్, విద్యార్థులు పాల్గొన్నారు.

గరివిడి రూరల్ : జాతీయ రహదారి భద్రత మసోత్సవాల్లో భాగంగా అవంతి ఇంజీనీరింగ్ కళాశాలలో అవగాహన సదస్సు ఏర్పాటు చేసి రోడ్డు ప్రమాదాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మోటార్ వెహికల్స్ ఇన్‌స్పెక్టర్ కె.రవి శంకర్ ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే ట్రాఫిక్ రూల్స్ గురించి అవగాహన కలిగి ఉండాలని, రోడ్డు ప్రమాదాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ప్రతి ఒక్కరూ విధిగా హెల్మెట్, సీటు బెల్ట్ ధరించాలని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని, వాహనం నడిపే ప్రతి ఒక్కరు డ్రైవింగ్ లైసెన్స్ కల్గి ఉండాలని వివరించారు.

ప్రతి రైతుకూ భూ ఆధార్ కార్డు

ప్రజాశక్తి-డెంకాడ

ప్రతి రైతుకూ భూ ఆధార్ కార్డు అందిస్తున్నట్లు ఎఒ పి.నిర్మల తెలిపారు. శుక్రవారం వ్యవసాయ శాఖ కార్యాలయంలో భూఆధార్ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భూమి ఉన్న ప్రతి రైతు భూ ఆధార్ నెంబర్ పొందాలని తెలియజేశారు. మండలంలో 36 మంది రైతులకు భూ ఆధార్ నంబర్ రూపొందించినట్లు చెప్పారు. వన్ బి, రేషన్ కార్డ్, ఆధార్ లింక్ అయిన ఫోను పట్టుకుని గ్రామంలో ఉన్న రైతు సేవా కేంద్రాన్ని సంప్రదించాలని తెలిపారు. భూఆధార్ నంబర్ ఉంటేనే అన్నదాత సుఖీభవ పథకం, రాయితీపై విత్తనాలు అందుతాయని చెప్పారు.

వృద్ధుల హక్కులకు భంగం కలగనివ్వొద్దు

ప్రజాశక్తి-బొబ్బిలి

వృద్ధుల హక్కులకు భంగం కలగకుండా చూడాలని పార్వతీపురం మన్యం జిల్లా అదనపు జడ్జి ఎస్.దామోదరరావు కోరారు. స్థానిక కోర్టులో శుక్రవారం వృద్ధులు హక్కులపై న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. వృద్ధులను సక్రమంగా చూడని పిల్లలపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో సీనియర్ సివిల్ జడ్జి ఎల్.అరుణశ్రీ, అదనవు జూనియర్ సివిల్ జడ్జి ఎం.రోహిణిరావు, లేబర్ ఆఫీసర్ కె.గౌరీశంకర్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పి.మోహన్ మురళీ కుమార్, న్యాయవాదులు, విద్యార్థులు పాల్గొన్నారు.



కార్యదర్శుల సంఘం మండల నూతన కార్యవర్గం ఇదే

కార్యదర్శుల సంఘం కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-డెంకాడ

పంచాయతీ కార్యదర్శుల సంఘం మండల నూతన కార్యక్రమంగా ఏకగ్రీవంగా ఎన్నికైంది. శుక్రవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఇఒపిఆర్‌డి శ్రీనివాసరావు అధ్యక్షతన మండల స్థాయి సమావేశం నిర్వహించారు. గౌరవాధ్యక్షులుగా బి.లక్ష్మణరావు, అధ్యక్షులుగా పి.వెంకటరావు, ఉపాధ్యక్షులుగా ఆర్ఎన్ఎల్ తులసి, ప్రధాన కార్యదర్శిగా సిహెచ్ అప్పలనాయుడు, సంయుక్త కార్యదర్శిగా బి.భవాని, కోశాధికారిగా జి.శ్రీనివాసరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా డి.వాసు, కార్యవర్గ సభ్యులుగా కె.రమేష్, జి.శంకరరావు, డి.భారతి, ఎస్.వహీద, వై.రమణ, ఎం.సాంబమూర్తిరాజు ఎన్నికయ్యారు.

355 మందికి విశ్వకర్మ యోజన రుణాలు

ప్రజాశక్తి-విజయనగరం కోట

పిఎం విశ్వకర్మ యోజన పథకం కింద జిల్లాలో 307 మంది లబ్ధిదారులకు రుణాలు మంజురైనట్లు కలెక్టర్ బి.ఆర్.అంబేద్కర్ తెలిపారు. 355 మందికి మంజూరు కాగా 307 మందికి రుణాలు చెల్లింపులు జరిగినట్లు వివరించారు. శుక్రవారం తన ఛాంబర్ లో పిఎం విశ్వకర్మ యోజన పథకంపై సమీక్షించారు. 777 గ్రామ పంచాయతీలు, 4 మున్సిపాలిటీలకు చెందిన సచివాలయాలకు 86,225 దరఖాస్తులు అందగా 16,330 మందికి మంజూరు చేస్తూ ఉత్తర్వులు వచ్చినట్లు కలెక్టర్ తెలిపారు. మిగిలిన వారికీ ఈ నెలాఖరు నాటికి రుణాలు మంజూరు కావాలని ఎల్‌డిఎం మూర్తికి కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో జిల్లా స్కిల్ డెవలప్మెంట్ అధికారి ప్రశాంత్ కుమార్, ఎల్‌డిఎం మూర్తి, డిఆర్‌డిఎ పీడీ కళ్యాణ చక్రవర్తి, ఇండస్ట్రియల్ ప్రమోషన్ అధికారి శశికళ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి మహిళా పారిశ్రామికవేత్తగా ఎదగాలి

ప్రజాశక్తి-విజయనగరం కోట

జిల్లాలో నైపుణ్యాభివృద్ధి సంస్థలో శిక్షణ పొందిన మహిళలంతా పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని కలెక్టర్ బి.ఆర్.అంబేద్కర్ తెలిపారు. సాధించిన నైపుణ్యం తో మీరు ఉపాధి పొందుతూ మరో ముగ్గురికైనా ఉపాధి అవకాశాన్ని కల్పించాలని అన్నారు. శుక్రవారం కలెక్టర్ తన ఛాంబర్ లో స్కిల్ డెవలప్మెంట్ ద్వారా 15 ట్రేడ్ లలో శిక్షణ పొందిన 30 మంది మహిళలకు సర్టిఫికేట్లను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యూనిట్ల స్థాపనకు ఎటువంటి పూచీకత్తు లు లేకుండా బ్యాంకుల ద్వారా రుణాలను అందజేస్తామన్నారు. కార్యక్రమం లో లీడ్ జిల్లా మేనేజర్ మూర్తి, స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి ప్రశాంత్ కుమార్, డిఆర్‌డిఎ పీడీ కళ్యాణ చక్రవర్తి పాల్గొన్నారు.



పల్లవిని అభినందిస్తున్న కరస్పాండెంట్ ఝాన్సీలక్ష్మి

పల్లవికి వెయిట్ లిఫ్టింగ్‌లో బంగారు పతకం

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

సత్య డిగ్రీ, పీజీ కళాశాలలో డిగ్రీ తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థి ఎస్.పల్లవి ఇటీవల జరిగిన 38 వ జాతీయ క్రీడలలో వెయిట్ లిఫ్టింగ్ లో 71 కేజీల విభాగంలో క్లీన్ అండ్ జర్క్ 118 కేజీలు, స్నాచ్ 94 కేజీలు మొత్తం 212 కేజీలు వెయిట్ ఎత్తి బంగారు పతకం సాధించింది. ఈ సందర్భంగా కళాశాల లో పల్లవిని, కోచ్ చల్లా రామును కళాశాలకరస్పాండెంట్ డాక్టర్ బొత్స ఝాన్సి లక్ష్మి, కళాశాల సంచాలకులు డాక్టర్ ఎం శశి భూషణ రావు, ముఖ్య అతిథి గా బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ డాక్టర్ కేసలి అప్పారావు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పల్లవికి వెయిట్ లిఫ్టింగ్ చేసేటప్పుడు వాడే బూట్ ను ఇచ్చి, ప్రతి నెలా డైట్ కోసం నగదు సహాయం కూడా చేయనున్నట్లు ఝాన్సీలక్ష్మి తెలిపారు. అంతర్జాతీయ స్థాయిలో మంచి ఖ్యాతి గడించాలని అన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవి సాయి దేవ మణి, ఎన్‌సిసి ఆఫీసర్లు కెప్టెన్ ఎం సత్య వేణి, లెఫ్టినెంట్ ఎం.ఉదయ్ కిరణ్, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ బి.సూరప్ప నాయుడు, కళాశాల ఫిజికల్ డైరెక్టర్ ఎస్‌హెచ్ హెచ్ ప్రసాద్, అధ్యాపకులు పాల్గొన్నారు.

విజేతలకు అభినందన

ఉత్తరాఖండ్ లో జరిగిన 38వ జాతీయ క్రీడా పోటీల్లో వెయిట్ లిఫ్టింగ్ 87 కేజీల విభాగంలో కాంస్య పతాకం సాధించిన విజయనగరం క్రీడాకారిణి కుమారి టి.సత్య జ్యోతిని, సీనియర్ మహిళల 71 కిలోల విభాగంలో బంగారు పతాకం సాధించిన కొండవెలగాడకు చెందిన శనపతి పల్లవిని విజయనగరం ఎమ్మెల్యే అతిధి విజయలక్ష్మి గజపతిరాజు,మాజీ కేంద్ర మంత్రి అశోక్ గజపతిరాజులు అభినందించారు. క్రీడాకారులతో పాటు కొచ్ చల్లా రాము ను అభినందించారు.

నేటి నుంచి ఉరుసు మహోత్సవం

ప్రజాశక్తి-విజయనగరం ప్రతినిధి

సూఫీ సెహన్షా హుజూర్ హజరత్ ఖాదర్ బాబా దర్గా క్షేత్రం జాతీయ సమైక్యతకు తార్కాణంగా నిలుస్తోందని దర్గా ధర్మకర్త ఎమ్‌డి ఖలీలుల్లా షరీఫ్ షా తెలిపారు. కుల, మత, వర్ణ, వర్గాలకు అతీతంగా ఖాదర్‌షా ఉరుసు మహోత్సవాలు ఏటా అత్యంత ఘనంగా జరుగుతున్నాయి. విశ్వ శాంతి దూతగా సూఫీ పరంపర విశ్వవిఖ్యాత వారసుడుగా హుజూర్ హజరత్ సయ్యద్ బాబా ఖాదర్ అవులియాను కొలుస్తుంటారు. ఆయన 66వ ఉరుసు సుగంధ మహోత్సవాలు శనివారం నుంచి మూడు రోజులు పాటు జరగనున్నాయి. డాక్టర్ ఎమ్‌డి ఖలీలుల్లా షరీఫ్ షా తాజ్ ఖాదరీ బాబు విజయనగరం ఖాదర్ బాబా దర్గా దర్బార్ షరీఫ్ నకు ధర్మకర్తగా వ్యవహరిస్తున్నారు. ఖలీల్ బాబు నేతృత్వంలో ఉత్సవాలు జరగనున్నాయి. మూడు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాలకు లక్షలాది మంది భక్తులు తరలి వస్తుంటారు. దేశ విదేశాలతో పాటు రెండు తెలుగు రాష్ట్రాల నుంచి లక్షలాది మంది తరలి రావడంతో ఖాదర్ బాబా ఉరుసు ఉత్సవాలు జాతీయ సమైక్యతకు తార్కాణంగా నిలుస్తున్నాయి. భక్తుల సౌకర్యార్థం వసతి, భోజన, తాగునీరు, శానిటేషన్ వంటి అన్ని ఏర్పాట్లను పూర్తి చేసినట్టు ఖలీల్ బాబు తెలిపారు. ఈ మూడు రోజులపాటు నిర్విరామంగా అన్న సమారాధన జరుగుతుందని తెలిపారు.

రమాబాయికి ఘన నివాళి

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని సింగరాయి ఎస్‌సి కాలనీలో శుక్రవారం మాతా రమాబాయి చిత్రపటానికి రమాబాయి మహిళా సంఘ సభ్యులు, మహిళలు ఘన నివాళులర్పించారు. రాజ్యాంగ నిర్మాత బిఆర్ అంబేద్కర్ సతీమణిగా రమాబాయి చేసిన సేవలను వారు కొనియాడారు. కార్యక్రమంలో ములగాడ వసంత, రిక్కి సన్యాసమ్మ, జామి నాగమ్మ, ఎర్రయ్యమ్మ, కృష్ణమ్మ, జె.లక్ష్మి, దేవుడమ్మ, అర్జునమ్మ, భాను తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

పాముకాటుతో రైతు మృతి

ప్రజాశక్తి-లక్కవరపుకోట

మండలంలోని మార్లాపల్లి గ్రామానికి చెందిన గోకాడ రమణ (54) పాముకాటుతో మరణించాడు. గురువార సాయంత్రం రమణ పొలానికి వెళ్లి ఏడు గంటల సమయంలో తిరిగి వస్తుండగా కాలిపై పాము కాటు వేసింది. వెంటనే చూసి చుట్టుపక్కల ఉన్న వారిని పిలిచాడు. వారు రమణ కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వెంటనే శృంగవరపుకోటలోని ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన చికిత్స కోసం విశాఖపట్నం కెజిహెచ్‌కి తరలించారు. శుక్రవారం తెల్లవారుజామున నాలుగు గంటల సమయంలో ఆయన మరణించాడు. రమణ భార్య గోకాడ మంగ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.

బస్సులో వ్యక్తి మృతి

ప్రజాశక్తి-గజపతినగరం

ఆర్‌టిసి పల్లెవెలుగు బస్సులో ప్రయాణిస్తున్న ఒక వ్యక్తి శుక్రవారం మృతి చెందాడు. అనారోగ్యంతో బాధపడుతున్న మెంటాడ మండలం పెదమేడపల్లికి చెందిన మార్పిన రామారావు (57)ను కుటుంబ సభ్యులు విశాఖ తీసుకెళ్తున్నారు. బస్సులో మధుపాడ గ్రామ సమీపానికి వచ్చే సరికి రామారావు మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు గమనించారు. దీంతో ఆర్‌టిసి సిబ్బంది రామారావు మృతదేహాన్ని బస్సులో నుంచి కిందికి దింపారు. అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులు స్వగ్రామానికి తరలించారు.

పొలాల్లోకి దూసుకుపోయిన లారీ

డ్రైవర్‌కు తప్పిన ముప్పు

ప్రజాశక్తి-బొండపల్లి

చత్తీస్‌ఘడ్ నుంచి కాకినాడకు బియ్యం లోడుతో వెళ్తున్న లారీ గురువారం రాత్రి 2గంటల సమయంలో నెలివాడ చెరువు వద్ద జాతీయ రహదారిపై నుంచి పొలాల్లోకి బోల్తా పడింది. ఈఘటనలో లారీ మూడు పల్టీలు కొట్టి పది అడుగుల లోతులో పొలాల్లో పడినప్పటికీ డ్రైవర్ రాజేష్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థి అదృశ్యం

ప్రజాశక్తి-తెర్లాం

మండలంలోని నందబలగ గ్రామానికి చెందిన అమలాపురం మణికంఠ కనిపించడం లేదని ఆ విద్యార్థి తల్లిదండ్రులు చంటి, సంధ్య శుక్రవారం తెర్లాం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదుచేశారు. మణికంఠ పదో తరగతి చదువుతున్నాడు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.